క్లుప్తంగా

పోలీసుల తనిఖీలు



బస్సులో తనిఖీ చేస్తున్న సీఐ శ్రీను

భైంసాటౌన్: భైంసా పట్టణంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణ సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట వాహనాల తనిఖీ నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వారి వెంట ఎస్సై శ్రీ కాంత్, పలువురు సిబ్బంది ఉన్నారు.

'మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దే'

లక్ష్మణచాంద: అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో బూత్ స్థాయి కమిటీని నియమించారు. అనంతరం ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. సమష్టిగా పని చేసి ఇంద్రకరణ్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, చామన్‌పెల్లి సర్పంచ్ గంగాధర్, రాజు, ముత్యం, గంగారాం, రవీందర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన చైర్మన్

నిర్మల్‌టౌన్: నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఇంద్రకరణ్‌రెడ్డి.. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫారం అందుకున్న విషయం తెలిసిందే. సోమవారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ సచివాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మూడోసారి నిర్మల్ ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వారి వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న సోహైల్ షా

కడెం: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యువత పని చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహైల్ షా అన్నారు. విద్యార్థి, యువత ఐకమత్య యాత్రలో భాగంగా సోమవారం కడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా యువకులకు పలు సూచనలు చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు రాకేశ్, సాయికిరణ్, అజ్మత్‌ఖాన్, అఖిల్, రఘు, గణేశ్ తదితరులు ఉన్నారు.


కేపీఎల్ టోర్నీ ప్రారంభం

కడెం: మండల కేంద్రానికి చెందిన ఫరీద్ అహ్మద్(బాబు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాబుబాయ్ జ్ఞాపకార్థం మండల కేంద్రంలో కడెం ప్రీమియర్ లీగ్(కేపీఎల్) క్రికెట్ పోటీలను సోమవారం ఎంపీపీ అలెగ్జాండర్ ప్రారంభించారు. నాలుగు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో విజేతలకు జన్నారంకు చెందిన మాదాడి పూర్ణచందర్‌రావు మొదటి బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పీపీఎల్-2 పోటీలు ప్రారంభం

పెంబి: మండల కేంద్రంలో సోమవారం పెంబి ప్రీమియర్ క్రికెట్ లీగ్-2 పోటీలను నాయకులు ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు ఎనిమిది జట్లుగా ఏర్పడ్డారు. ఈ మ్యాచ్‌లు పదిరోజుల పాటు కొనసాగుతాయి. సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, పాకాల రాంచంధర్, గంగారెడ్డి, నరేందర్ రెడ్డి, శంకర్, స్వప్నీల్‌రెడ్డి, గోవింద్, శంకర్, ప్రవీణ్‌గౌడ్, పీపీఎల్ నిర్వాహకులు మతీన్, నరేశ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అశోక్

కుంటాల: కుంటాల పంచాయతీ పరిధిలోని సేవాలాల్ తండాకు చెందిన చవాన్ అశోక్(26) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. అశోక్ ఉపాధి కోసం భార్యా పిల్లలతో లోకేశ్వరం మండలం బిలోలి గ్రామానికి వెళ్లాడు. రోజు మద్యం తాగడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో సోమవారం అతిగా మద్యం సేవించి మనస్తాపం చెందిన అశోక్ కల్లూర్ ఎర్రకుంట చెరువు కట్టపై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అశోక్ తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కమ్మేస్తున్న దుమ్ముతో కష్టాలు

- అసంపూర్తిగా భైంసా- బాసర రోడ్డు నిర్మాణం
- వంతెనలు, కల్వర్టులున్న చోట పనులు చేపట్టని సిబ్బంది
- నీళ్లు చల్లకపోవడంతో లేస్తున్న దుమ్ము
- ఎదురొచ్చే వాహనాలు కన్పించక ప్రజల అవస్థలు
- ఇబ్బంది పడుతున్న చోదకులు



భైంసా-బాసర మార్గంలో వాహనాలను కమ్మేస్తున్న దుమ్ము



బాసర ట్రిపుల్‌ఐటీ సమీపంలో జరుగుతున్న పనులు

భైంసా: నియోజకవర్గంలో భైంసా నుంచి బాసర వరకు కొనసాగుతున్న హైవే పనులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బోధన్ నుంచి భైంసా వరకు 56.4 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును రూ.650 కోట్లతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన అనూష కన్‌స్ట్రక్షన్ అనే కంపెనీ చేపడుతుంది. ఈ పనుల్లో భాగంగా భైంసా- బాసర వరకు ఇరువైపులా రోడ్డును తోడి గ్రావెల్ వేసి రోలర్‌తో చదును చేసి బీటీరోడ్డు పనులు పూర్తిచేశారు. కానీ వంతెనలు, కల్వర్టులున్న ప్రాంతంలో మాత్రం పనులు చేపట్టలేదు. దీంతో భైంసా నుంచి బాసర వరకు అసంపూర్తిగా రోడ్డు ఉండి వంతెనలు, కల్వర్టులున్న చోట కంకర తేలడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు.

హైస్పీడ్‌తో లోడింగ్ వాహనాలు..

పనుల ప్రాంతంలో నిర్మాణ సంస్థ టిప్పర్లు వందల సంఖ్యలో కనిపిస్తున్నాయి. మొరం, కంకర, డస్ట్ తదితర సామగ్రి సరఫరా చేసే టిప్పర్లన్నీ హైస్పీడ్‌తోనే వెళ్తున్నాయి. లోడింగ్ టిప్పర్ వెనుకాల ఏయే వాహనం వెళ్లిన దుమ్ములో కూరుకుపోతుంది. ఒక్కోసారి ఈ మార్గంలో కమ్మేసే దుమ్ముతో ఎదురు వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదం పొంచి ఉంది.

నీళ్లు చల్లించాలి..

రోడ్డు నిర్మాణ పనుల సమయంలో ఎప్పటికప్పుడు నీటిని చల్లిస్తే దుమ్ము లేచే అవకాశం ఉండదు. కిలోమీటర్ల మేర దుమ్ములోనే ప్రయాణం చేయడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు జరుగుతున్న రోడ్డుపై నీళ్లు చల్లించి దుమ్ము లేవకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకవైపైనా పూర్తి చేయాలి..

భైంసా నుంచి బాసర వరకు నిర్మిస్తున్న ఈ హైవే పనులు ఏదో ఒక వైపు పూర్తి చేస్తే ఇబ్బందులు తీరుతాయి. ఉత్సవాల నేపథ్యంలో మహారాష్ట్రతోపాటు మన ప్రాంతంలోని భక్తుల వాహనాలు ఈ మార్గం గుండానే వెళ్తుంటాయి. రెండు వైపుల కాకఒకవైపు రోడ్డు పనులు పూర్తి చేస్తే ఇబ్బందులు ఉండవు.

అండర్‌పాస్ పనులు...

బాసర రైల్వేస్టేషన్ వద్ద అండర్‌పాస్ పనులు కొనసాగుతున్నాయి. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా పిల్లర్లతోపాటు ఇరువైపుల రోడ్డును కూడా తవ్వి వదిలేశారు. ఇరువైపుల బీటీ షోల్డర్స్ వేసేందుకు రోడ్డు తవ్వేశారు. గోదావరిపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గోదావరి నదిలో నీరు చేరడంతో పనులు జరగడం లేదు.

దుమ్ముతో పాదచారులకు కష్టమే..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు నిత్యం బాసర సరస్వతీ ఆలయానికి కాలినడకన వెళ్తుంటారు. మహారాష్ట్ర, ఉమ్మడి జిల్లా నుంచి వచ్చేవారితోపాటు అమ్మవారి దీక్షాపరులంతా భైంసా నుంచి బాసర వరకు ఉన్న ప్రధాన రోడ్డుపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఈ మార్గంలో సాగుతున్న రోడ్డు పనులతో దుమ్ము రేగుతోంది. ముధోల్ మండలం టాక్లి నుంచి బిద్రెల్లి వరకు రోడ్డు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కంకర, మొరం వేసి రోడ్డు ఎత్తును పెంచుతున్నారు. కంకరపై పాదరక్షలు లేకుండా నడిస్తే నొప్పులు వస్తాయి. పదునైన రాళ్లు ఉంటే కాళ్లకు గాయాలవుతాయి. కంకర వేసి న రో డ్డుపై మొరం పోయాలని భక్తులు కోరుతున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం

భైంసా-బాసర రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. ఇప్పటికే పనులు చాలా చోట్ల పూర్తయ్యాయి. వంతెనలు, కల్వర్టులు నిర్మించే క్రమంలో రోడ్డును అక్కడక్కడా మళ్లించాం. ప్రస్తుతం టాక్లి, బిద్రెల్లి, బాసర వరకు పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. రైల్వేస్టేషన్ వద్ద అండర్‌పాస్ పనులు కొనసాగుతున్నాయి.

– సుభాష్, డీఈఈ

అడెల్లి మహాపోచమ్మ జాతరపై సమీక్ష



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, భక్తులు

సారంగపూర్: ఈనెల 21, 22 తేదీల్లో జరిగే మండలంలోని అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర ఏర్పాట్లపై సోమవారం ఆలయ ఈఓ రంగు రవికిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జాతర నేపథ్యంలో గోదావరి నదికి ఆభరణాలు తీసుకెళ్లి.. తిరిగి తీసుకొచ్చే క్రమంలో ప్రత్యేక బృందాలతో బందోబస్తు చేపడుతామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆభరణాలను తరలించే మార్గంలో మరమ్మతులు చేయించేలా ఆయా గ్రామాల సర్పంచ్‌లను ఆదేశిస్తామని ఎంపీడీఓ సరోజ తెలిపారు. భక్తుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయిస్తామని హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్ పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ శ్రీదేవి సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జాతరకు సంబంధించిన పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. ప్రత్యేక వాహనాల ద్వారా ప్రచారం చేపడుతామని ఈఓ తెలిపారు. ఆలయ పరిసరాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి భక్తుల పూజలు



నర్సాపూర్(జి): పూజలు చేస్తున్న భక్తులు



పార్‌పెల్లిలో శివపార్వతుల కల్యాణంలో భక్తులు

ఖానాపూర్: దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గోసంపల్లె గ్రామంలో దుర్గామాత దీక్షాపరుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని కుర్మెవాడలో సోమవారం గాయత్రిదేవి రూపంలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చింది. పురోహితులు యుగంధర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు.

శివ పార్వతుల కల్యాణం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. దుర్గామాత సన్నిధిలో శివపార్వతులకు పట్టువస్త్రాలు సమర్పించి ముత్యాల తలంబ్రాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వేడుక వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ రాజేందర్, దీక్షాపరులు, దుర్గామాత కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



ఓలాలో పూజలు చేస్తున్న సర్పంచ్ ఫాతిమా

మతసామరస్యం చాటిన సర్పంచ్

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన సర్పంచ్ కనీస్ ఫాతిమా సోమవారం దుర్గాదేవి మండపం వద్ద పూజలు నిర్వహించి మతసామరస్యం చాటారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలను ఆమె సూచించారు.

'వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

నిర్మల్‌ఖిల్లా: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ప్రకటించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో లక్ష్మణచాంద మండల వడ్డెర సంఘం మహిళా నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఎన్నికల తరుణంలో రాజకీయ పార్టీల నాయకులు ప్రజాక్షేత్రంలో అంగీకార పత్రంపై సంతకాలు చేయాలని కోరారు. వడ్డెరలకు వెన్నుదన్నుగా నిలిచే వారికే మద్దతిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ఉపాధ్యక్షులు అలకుంట వెంకవ్వ-శ్రీనివాస్, రేపని సాయవ్వ, వరికుప్పల పోసాని, రాజమణి, ఎల్లవ్వ, గంగవ్వ, అంజలి, లక్ష్మి, స్వప్న తదితరులు ఉన్నారు.

'మేనిఫెస్టోను కాపీ కొట్టిన బీఆర్ఎస్'



మాట్లాడుతున్న సతీశ్‌రెడ్డి

కడెం: కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోనే బీఆర్ఎస్ కాపీ కొట్టిందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన నిరుద్యోగ భృతి ఇవ్వకుండా సీఎం కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఈసారి కూడా కూడా మేనిఫెస్టోలో నిరుద్యోగుల ప్రస్తావన లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తరి శంకర్, రఫీక్, యాదగిరి, రహీం, సత్యంచారి, లచ్చన్న, బ్రహ్మచారి, కుమార్, రాజన్న తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాల పోస్టర్లను తొలగించాలి

లోకేశ్వరం: ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను తొలగించాలని ఏంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. వారి వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

కుంటాల: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సల్మాన్‌రాజ్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. పోలింగ్‌కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎంసీసీ బృందం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు, డోర్ స్టిక్కర్లు, ఆయా పార్టీల జెండాలను తొలగించారు.

'రద్దును మేనిఫెస్టోలో చేర్చాలి'

కుంటాల: అన్ని రాజకీయ పార్టీలు సీపీఎస్ రద్దును తమ మేనిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ ఎంప్లాయీస్ యూనియన్(టీఎస్‌సీపీఎస్) జిల్లా అధ్యక్షుడు కె. కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం కుంటాలలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రెండున్నర లక్షల మంది ఉద్యోగులకు సీపీఎస్ పెద్ద సమస్యగా మారిందన్నారు. కర్ణాటకలో సీపీఎస్ రద్దును మేనిఫెస్టోలో చేర్చడంతోనే అక్కడ కాంగ్రెస్ గెలిచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతిగౌడ్, నారాయణ, నగేశ్, నవీన్, రాజబాపు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ మారినా పేరు మారలే..

జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డిను ఇటీవల ఎన్నికల సంఘం తప్పించి.. ఆయన స్థానంలో ఆశిష్ సంగ్వాన్‌ను నియమించింది. కొత్త కలెక్టర్ బాధ్యతలు చేపట్టి మూడు రోజులు గడిచినా.. క్యాంపు కార్యాలయంలో నేమ్ ప్లేట్ మారలేదు. ఇంకా వరుణ్‌రెడ్డి పేరే దర్శనమిస్తోంది. సోమవారం ప్రజావాణికి వచ్చిన పలువురు వరుణ్‌రెడ్డి పేరు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ



తానూరులో బతుకమ్మలతో మహిళలు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించారు. చిత్తు చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ అంటూ పాడుతూ సందడి చేశారు. అనంతరం సమీపంలోని వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వేడుకలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకండి రమాదేవి పాల్గొని ఆడి పాడారు.

తానూరు:మండల కేంద్రంతోపాటు ఎల్వి గ్రామంలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు కోలాటం వేస్తూ ఆడి పాడారు. అనంతరం గ్రామ సమీపంలోని వాగులకు బతుకమ్మలను తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

కుభీర్: మండల కేంద్రంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మలను సుందరంగా అలంకరించారు. కోలాటం వేస్తూ సందడి చేశారు. పంచాయతీ వారు ఏర్పాట్లు చేశారు.

భైంసారూరల్: మండలంలోని హస్గుల్ గ్రామంలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళలతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావ్ పటేల్ కోలాటం ఆడి సందడి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



కుంటాల: బతుకమ్మ ఆడుతున్న రమాదేవి



కుభీర్‌లో బతుకమ్మలతో మహిళలు



భైంసారూరల్: సంబరాల్లో రామారావ్ పటేల్

కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రచారం

సారంగపూర్: నిర్మల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న కూచాడి శ్రీహరిరావును గెలిపించాలని ఆయన కుమార్తె మాధురి అన్నారు. సోమవారం మండలంలోని కంకెట, వైకుంఠాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోను, తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్ఎస్ చేసిన అన్యాయాన్ని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌ను ఆదరిస్తే వచ్చే ఐదేళ్లలో నిర్మల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేయడంతోపాటు కులాల్లో చిచ్చు పెట్టిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రొడ్డ సునీత, పలువురు నాయకులు మారుతి, అబ్దుల్ హాదీ, విలాస్‌రావు, సలీం, తదితరులు ఉన్నారు.



సారంగపూర్: వైకుంఠాపూర్‌లో ప్రచారం చేస్తున్న శ్రీహరిరావు కూతురు మాధురి, నేతలు

కాంగ్రెస్‌లో చేరిక..

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామ సర్పంచ్ లోక నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు భర్త తక్కల్ల సత్తెన్న, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు మండల కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్, గొర్ల వెంకటేశ్, వాజీద్‌ఖాన్, భూషణం తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని పేర్కపల్లె గ్రామానికి చెందిన పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు చుంచు భూమన్న, భూత్కూర్‌కు చెందిన పలువురు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు సమక్షంలో పార్టీలో చేరగా.. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. భూత్కూర్‌కు చెందిన మాజీ ఉప సర్పంచ్ బొబ్బిలి నాగరాజు, జాడి గోపి, అప్పని రాజన్న ఉన్నారు.

కాంగ్రెస్ వస్తేనే అభివృద్ధి..

లోకేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు విజయకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని భాగాపూర్, లోకేశ్వరం గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. దేవేందర్, భోజన్న తదితరులు ఉన్నారు.

'కార్మికుల ప్రస్తావన లేకపోవడం సిగ్గుచేటు'

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ఉద్యోగ, అసంఘటిత రంగ కార్మికుల ప్రస్తావనే లేకపోవడం సిగ్గు చేటని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన ఆశవర్కర్ల జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కార్మికవర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగామణి మాట్లాడుతూ మున్సిపల్, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ రంగ ఉద్యోగ, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. ఎన్నికల మేనిఫెస్టోలో కార్మిక వర్గం గురించి ప్రస్తావన చేయని పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల సంఘం గౌరవ అధ్యక్షులు సుజాత, జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, విజయ, రామలక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.